మంగళవారం 22.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34    సంచిక - 152    www.journalistfile.com    పేజీలు 8    వెల : రూ.5.00



మెగా డీఎస్సీ పారదర్శకతపై అనుమానాలకు తావులేదు. ప్రతి ఆరోపణకు ఆధారాలతో సమాధానం ఇస్తాం. కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు. అభ్యంతరాలుంటే న్యాయస్థానాలను ఆశ్రయించాలి. భౌతిక ఘర్షణలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష



- కుప్పంలో రూ.45 కోట్లతో రిజర్వాయర్
- ప్రతి ఇంటినీ ఆర్థికంగా బలోపేతం చేస్తాం
- కుప్పం అభివృద్ధికి కొత్తఊపు తెస్తాం
- కుప్పంలో రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు భూమిపూజ, శంకుస్థాపనలు

**కుప్పం, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** నారావారిపల్లె తనకు జన్మనిస్తే... కుప్పం రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా, స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. గడచిన రెండేళ్లలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కుప్పం నుంచే ఏ పని చేయాలన్నా నాంది పలుకుతామని చెప్పారు. కుప్పంలో సోమవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీటిని తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని 550కు పైగా చిన్న నీటిపారుదల చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్, పైప్‌లైన్లతో అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. యామిగానిపల్లి, మనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. బీరువానిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా రూ.45 కోట్లతో రిజర్వాయర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. పశు దాణాకు ఇబ్బంది లేకుండా కూడా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో నీటి లభ్యతపై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అధికంగా రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష అనే విధానంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ ఎరువుల వినియోగం, బయోచార్ వంటి విధానాలతో భూమిలో సారం, తేమ పెంచడంతో పాటు జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని చెప్పారు. పీఎండీఎస్ విధానం ద్వారా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, భూములను ఖాళీగా ఉంచకుండా సాగులోకి తీసుకురావాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలతో పాటు పశుపోషణ, పౌల్ట్రీ, ఉద్యాన పంటలపై దృష్టి పెడితే రైతులు, మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

**ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ :** కుప్పాన్ని నెట్‌జీరో నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు సహా అన్ని భవనాలు నెట్‌జీరో దిశగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి.. ప్రతి ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారేలా చర్యలు చేపడతామని చెప్పారు. వ్యవసాయ ఫీడర్ల కోసం 15 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కుప్పంలో 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి పీ4 కార్యక్రమం



2 లో

## శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



**విజయవాడ, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా నియామకాల వివాదం విజయవాడలో ఉద్రిక్తతకు దారితీసింది. స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శాప్ కార్యాలయం వద్ద పోటాపోటీగా నిరసనలు చేపట్టడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో.. వాటిని ఖండిస్తూ ఉపాధ్యాయులు శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ భరణికి వినతిపత్రాలు సమర్పించేందుకు వారు వచ్చారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య నినాదాలతో వాతావరణం వేడెక్కింది.

**పరస్పరం ఆరోపణలు :** స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు, నకిలీ ధ్రువపత్రాల వినియోగం జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అయితే, తమ సర్టిఫికెట్లు, క్రీడా పతకాలు అసలైనవేనని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. తమ నియామకాలు ప్రతిభ, అర్హతల ఆధారంగానే జరిగాయని పేర్కొన్నారు.

**తోపులాట.. ఉద్రిక్తత :** నిరసనల సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

మిగతా 2లో...

## గురువులపై దాడులు బరితెగింపే

- ఉపాధ్యాయులపై గొడ్డలి పార్టీ దాడులపై చర్యలు తీసుకుంటాం
- నియామక ప్రక్రియపై అభ్యంతరాలుంటే కోర్టులకు వెళ్లొచ్చు... దాడులు చేయడమేంటీ.?
- డీఎస్సీ నియామకాలపై చర్చకు అసెంబ్లీకి వస్తే సాక్ష్యాలతో సమాధానం చెబుతాం
- కుక్కతోక వంకర తీరులా గొడ్డలి పార్టీ వ్యవహారం
- కుప్పం బహిరంగ సభలో వైసీపీపై విరుచుకుపడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 2లో...



## టీచర్లపై దాడి హేయం



- వైసీపీ ప్రేరేపిత రౌడీ మూకలను ఉపేక్షించేది లేదు
- ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల జోలికి రావొద్దు
- మంత్రి నారా లోకేష్

**అమరావతి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. క్రీడల్లో ప్రతిభ చూపి స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని కోరుతూ శాప్ కార్యాలయంలో అధికారులను కలిసిన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై లోకేష్ స్పందించారు. క్రీడల ద్వారా రాష్ట్రం, దేశానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులపై గత ప్రభుత్వం హయాంలో స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు.

మిగతా 2లో...

## పోలీస్ ఉద్యోగాల కోసం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- ఈ నెలాఖరు 30వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు కు గడువు
- సిఈడిఎం ద్వారా ఉచిత శిక్షణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

2 లో

## ఆరోగ్య నిలయాలుగా గ్రామీణ చెరువులు

- ఫక్రుద్దీన్ పాలెం మైసమ్మ చెరువు ప్రారంభం
- పిఠాపురం నియోజకవర్గంలో రూ.6 కోట్లతో 11 చెరువుల సుందరీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ

3 లో

## ప్రభుత్వ వైద్యుల దీర్ఘకాల గైర్హాజరీపై కఠిన చర్యలు



- ప్రైవేటు వైద్యుల మెడికల్ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట
- మూడు నెలల్లోగా క్రమశిక్షణ చర్యలు పూర్తి చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖలో ఫైళ్ల పరిష్కారానికి వేగం పెంచాలి
- ఏ స్థాయిలోనూ రెండు రోజులకు మించి ఫైలు పెండింగ్‌లో ఉండకూడదు
- ఫైళ్ళ కదలికపై నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్‌బోర్డు
- 15 రోజుల్లోగా దస్త్రాలపై నిర్ణయం తీసుకునేలా వ్యవస్థలో మార్పులు
- జాప్యానికి బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు
- వైద్యారోగ్య శాఖ అధికారుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ ఆదేశం

**మంగళగిరి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** వైద్య ఆరోగ్య శాఖలో ఫైళ్ళ పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని పూర్తిగా నివారించి, ఫైళ్ళ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో శాఖకు చెందిన అన్ని విభాగాధిపతులు, ఉన్నతాధికారులతో మూడు గంటలకు పైగా నిర్వహించిన సమీక్షసమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**4,410 ఫైళ్ళలో 40 శాతమే పరిష్కారం :** 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సాధారణ ప్రజల నుంచి వచ్చిన 4,410 అంశాలను పరిశీలన, పరిష్కారం కోసం వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలకు పంపినట్లు సమీక్షలో వెల్లడైంది. వీటిలో అధిక సంఖ్యలో బదిలీలకు సంబంధించిన అంశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఫైళ్ళలో ఇప్పటివరకు సుమారు 40 శాతం మాత్రమే పరిష్కరించినట్లు మంత్రి దృష్టికి వచ్చింది.

ఫైళ్ళ పరిష్కారంలో జాప్యానికి సిబ్బంది కొరత కూడా ఒక కారణమని అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తగిన పాలనా సంస్కరణలు చేపట్టి ఫైళ్ళ పరిష్కార వేగాన్ని పెంచాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

**రెండు రోజులకు మించి ఫైలు ఆగకూడదు :** ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ స్థాయిల్లో ఫైళ్ళ పరిశీలన జరుగుతున్నందున ఏ స్థాయిలోనూ ఒక ఫైలు రెండు రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఏ అంశమైనా గరిష్ఠంగా 15 రోజుల్లో పరిశీలించి నిర్ణయం తీసుకునేలా విధానంలో మార్పులు తీసుకురావాలని ఆదేశించారు.

మిగతా 2లో...

## ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా?



**అమరావతి, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి, నిబంధనల ప్రకారం మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీయడం సరికాదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే నిరసన తెలియజేయవచ్చని, ఆధారాలుంటే సంబంధిత సంస్థల ముందు ఉంచవచ్చని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. అయితే కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను 'ఫేక్' అంటూ అవమానించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. విజయవాడలో ఉపాధ్యాయులపై దాడి జరిగిందన్న ఆరోపణలు తీవ్రమైనవని, ఘటనలో ఎవరు చట్టాన్ని అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రాధాన్య హామీల్లో మెగా డీఎస్సీ ఒకటని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, సమాధానాల కీల విడుదల, మెరిట్ జాబితాలు, అభ్యంతరాల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన, తుది ఎంపిక వరకు నిర్దేశిత విధానాలను అనుసరించామని, నియామక ప్రక్రియల్లో పారదర్శకత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. స్పోర్ట్స్ కోటా ద్వారా నిబంధనల ప్రకారం ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను 'ఫేక్' అని ముద్ర వేయడం సరికాదని, ఏదైనా ధ్రువపత్రంపై అనుమానం ఉంటే పరిశీలించి తప్పు ఉంటే చర్యలు తీసుకోవచ్చని, కానీ మొత్తం అభ్యర్థుల గౌరవాన్ని దెబ్బతీయడం తగదని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రధాన పరీక్షల మూల్యాంకన ప్రక్రియపై ప్రత్యేక దర్యాప్తు బృందం పరిశీలనలో బయటపడిన విధానపరమైన లోపాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 2018 డిసెంబర్ 31న గ్రూప్-1 నియామకాలకు నోటిఫికేషన్ జారీ కాగా, 2020 డిసెంబర్ 14 నుంచి 20 వరకు ప్రధాన పరీక్షలు జరిగాయని, 6,807 మంది అభ్యర్థులు ఏడు పేపర్లను పూర్తి చేశారని తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందం పరిశీలించిన 736 మంది అభ్యర్థులకు సంబంధించిన రికార్డుల్లో 718 మూల్యాంకన పత్రాల్లో దిద్దుబాట్లు లేదా మార్పులు గుర్తించినట్లు పేర్కొన్నారు. వివిధ దశల్లో సంతకాలలో తేడాలు, రాతపై మార్పులు, దిద్దుబాటు ద్రవం వినియోగం వంటి అంశాలను కూడా దర్యాప్తు గుర్తించినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. 736 రికార్డుల్లో 718 మూల్యాంకన పత్రాల్లో దిద్దుబాట్లు కనిపించడానికి కారణమేంటి, ఇంత పెద్ద సంఖ్యలో మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చింది, వాటిని ఎవరు చేశారు, ఏ నిబంధనల ప్రకారం చేశారనే ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు అన్నారు. రాజకీయంగా విభేదించవచ్చని, వాదించవచ్చని కానీ భౌతిక ఘర్షణలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, ముఖ్యంగా సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే గురువులు రాజకీయ ఘర్షణల్లో బాధితులుగా మారడం బాధాకరమని పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభుత్వ యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన హోంమంత్రి అనిత



**అమరావతి, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.

తీవ్రవాయుగుండంప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్ణీత గడువు పాటించాలి




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు అందే ఫిర్యాదుల్లో అధికంగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే ఉంటున్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురైతే దరఖాస్తుదారులకు కారణాలను వివరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా మొత్తం 43 అర్జీలు అందాయని అదనపు కమిషనర్ తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 13, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 7, ఉపా సెల్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సాంబశివరావు, సి. హెచ్. శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డీసీపీ సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, విభాగాధిపతులు, మేనేజర్ బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య నిలయాలుగా గ్రామీణ చెరువులు



**పిఠాపురం, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగానే కాకుండా ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించే సామాజిక వేదికలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఫకృద్దీన్ పాలెం గ్రామంలో రూ.73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువు, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కును సోమవారం ఆయన ప్రారంభించారు. మైసమ్మ చెరువును మోడల్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారు. చెరువు గట్టును బలోపేతం చేయడంతో పాటు చుట్టూ పచ్చదనం పెంచారు. గట్టుపై వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కు, జెండా స్థూపం ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామస్థులు నడక, వ్యాయామం చేసుకునేలా సౌకర్యాలను కల్పించారు. మహిళలు, యువత, వృద్ధులు వినియోగించుకునేలా ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మైసమ్మ చెరువును సందర్శించిన పవన్ కల్యాణ్ వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి చేయనున్న మరో 11 చెరువులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువులకు సంబంధించిన గ్యాలరీని పరిశీలించారు.

చెరువు గట్టు వెంబడి నడుస్తూ అక్కడున్న భారీ వృక్షాల వయసు, కొన్ని చెట్ల శాస్త్రీయ నామాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల సుందరీకరణతో గ్రామీణ ప్రజలకు విశ్రాంతి, వినోదంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. మైసమ్మ చెరువు కుడివైపున పిల్లల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి పవన్ కల్యాణ్ పార్కును ప్రారంభించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. పార్కులో ఆడుకుంటున్న పిల్లలకు తినుబండారాలు, చాక్లెట్లు అందించారు.

గ్రామాల అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఫకృద్దీన్ పాలెం మైసమ్మ చెరువు భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్ల వ్యయంతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టారు. వీటిలో సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా అన్ని చెరువుల సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మైసమ్మ చెరువు ప్రారంభోత్సవానికి ముందు గట్టుపై ఉన్న ఆలయంలో పవన్ కల్యాణ్ మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు మధ్య భాగానికి వచ్చే విధంగా నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడితో కూడిన శివుడి విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఫకృద్దీన్ పాలెంలోని వినాయకుడి ఆలయాన్ని సందర్శించారు.

చెరువు ప్రారంభోత్సవానికి వచ్చిన పవన్ కల్యాణ్ గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. గ్రామ సచివాలయ భవనం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త కోసం ఏర్పాటు చేసిన కుండీలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి పారిశుధ్య కార్మికులను పలకరించి వారితో ఫొటోలు దిగారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, భాజపా నాయకుడు కృష్ణంరాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్, పాడా పీడీ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శాప్ కార్యాలయం వద్ద దాడిపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం

- **సీసీటీవీ, వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితుల గుర్తింపు**
- **దాడిలో పాల్గొన్న వారిపై కేసుల నమోదుకు చర్యలు**
- **అనుమతి లేకుండా ర్యాలీ.. నిబంధనల ఉల్లంఘనపైనా కేసులు**



**విజయవాడ, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఉద్రిక్తత, ఉపాధ్యాయులపై దాడి ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఘటనలో పాల్గొన్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు కేసుల నమోదు, నిందితుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు.

కార్యాలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌తో పాటు ఘటనకు సంబంధించిన వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఫుటేజ్ ఆధారంగా దాడి, నిరసనల్లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. మూకుమ్మడి దాడులు, నిబంధనల ఉల్లంఘన, అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన అంశాలపై మాచవరం, సూర్యారావుపేట, కృష్ణలంక పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసే ప్రక్రియ జరుగుతున్నట్లు సమాచారం.

కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉన్న వీడియో ఫుటేజ్‌ను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఘటనలో పాల్గొన్న పలువురి కదలికలను ఫుటేజ్ ఆధారంగా విశ్లేషిస్తూ, బాధ్యులపై చట్టపరమైన చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నారు. విజయవాడతో పాటు మచిలీపట్నం, గుంటూరు, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు కూడా ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

**స్పోర్ట్స్ కోటా టీచర్ల నిరసనతో ఉద్రిక్తత :** మెగా డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా నియామకాలకు సంబంధించి వైఎస్సార్సీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు తమ వాదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ భరణికి వినతిపత్రాలు సమర్పించేందుకు వారు అక్కడికి వచ్చారు. అదే సమయంలో వైఎస్సార్సీపీ నాయకులు శాప్ కార్యాలయం వెలుపల నిరసనకు దిగారు. దేవినేని అవినాశ్, జోగి రమేష్‌నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు వివిధ ప్రాంతాల నుంచి అక్కడికి చేరుకున్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని వారు ఆరోపించగా, ఉపాధ్యాయులు ఆ ఆరోపణలను ఖండించారు. ఇరువర్గాలు పరస్పరం నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**ఉపాధ్యాయులపై దాడి ఆరోపణలు :** నిరసన సందర్భంగా కొందరు వ్యక్తులు ఉపాధ్యాయులపై వాటర్ బాటిళ్లు విసిరినట్లు, కర్రలు, రాడ్లతో దాడికి ప్రయత్నించినట్లు బాధితులు ఆరోపించారు. ఉపాధ్యాయులను రక్షించేందుకు వెళ్లిన టీడీపీ యువగళం బృందం సభ్యులపైనా దాడి జరిగినట్లు వారు తెలిపారు. ఘటనలో తమకు గాయాలయ్యాయని బాధితులు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొనగా, తమ నియామకాలు ప్రతిభ ఆధారంగా జరిగాయని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. తమ వద్ద అసలు ధ్రువపత్రాలు, క్రీడా పతకాలు ఉన్నాయని వారు తెలిపారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో పరిస్థితి ఘర్షణకు దారితీసింది.

**బందరు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభన :** ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పెరగడంతో కొందరు పరస్పరం తోపులాటకు దిగారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నించగా, పోలీసులకు, నిరసనకారులకు మధ్య కూడా తోపులాట చోటుచేసుకున్నట్లు సమాచారం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శాప్ కార్యాలయం పరిసరాల్లో ఆందోళన కొనసాగడంతో విజయవాడ ప్రధాన రహదారి బందరు రోడ్డుపై ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది.

ఘటనకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన అనంతరం పూర్తి వివరాలను నిర్ధారించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లను సహించేది లేదు

- **స్పోర్ట్స్ కోటా ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతాం**
- **శాప్ కార్యాలయం వద్ద వైసీపీ అల్లర్లు దుర్మార్గం**
- **దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి...మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**విజయవాడ, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉద్యోగులపై వైసీపీ నేతలు, కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడిన ఘటనను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడించి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని అన్నారు.

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, కష్టపడి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను అవమానించడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారిపై ఫేక్ సర్టిఫికెట్లు అంటూ ఆరోపణలు చేయడం క్రీడాలోకాన్ని అవమానించడమేనన్నారు.

**క్రీడాకారులకు 3 శాతం ఉద్యోగ రిజర్వేషన్ :** క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. క్రీడాకారులకు గౌరవం, గుర్తింపు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ విధానమని చెప్పారు.

క్రీడాకారుల సర్టిఫికెట్లు, మెడల్స్‌పై అనుమానాలు ఉంటే నిబంధనల ప్రకారం సంబంధిత సంస్థలు పరిశీలించవచ్చని, కానీ ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను బహిరంగంగా అవమానించడం లేదా వారిపై దాడులకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ నియామకాల్లో రాజకీయ జోక్యం లేదు :** మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరిగిందని మంత్రి తెలిపారు. నోటిఫికేషన్ నుంచి ఎంపిక ప్రక్రియ వరకు ప్రభుత్వ సంస్థలు, సంబంధిత అధికారులు తమ విధులను నిర్వర్తించారని చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో రాజకీయ జోక్యానికి ప్రభుత్వం తావివ్వలేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత, ప్రతిభ ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. కష్టపడి చదివి, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

**అల్లర్లు, దాడులను సహించేది లేదు :** శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రజాస్వామ్యంలో అవకాశం ఉందని, అయితే ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లు సృష్టించడం, ఉద్యోగులపై దాడులకు ప్రయత్నించడం మాత్రం సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, క్రీడాకారులపై భౌతిక దాడులకు పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

**ఉపాధ్యాయులు, క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది :** కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. వారి హక్కులు, ఆత్మగౌరవం, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్రీడాకారుల సంక్షేమం, క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, అసోసియేషన్లకు స్వేచ్ఛనిస్తూ నిబంధనల అమలును శాప్ పర్యవేక్షిస్తోందని చెప్పారు.

**క్రీడాకారులను రాజకీయాలకు దూరంగా ఉంచాలి :** క్రీడాకారులు, ఉపాధ్యాయుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం సరికాదని మంత్రి అన్నారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, వారిపై నిరాధార ఆరోపణలు చేసి మానసికంగా వేధించడం తగదని పేర్కొన్నారు.

క్రీడల ద్వారా దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులకు గౌరవం ఇవ్వాలని, వారి ప్రతిభను గుర్తించి మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## గురుజాడ అప్పారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి కర్తవ్యం




మహాకవి గురుజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మంత్రి దుర్గేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు సాహిత్య దిగ్గజం, అభ్యుదయవాది, సంఘ సంస్కర్త మహాకవి గురుజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకోవడం ఎంతో సంతోషదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం మహాకవి గురుజాడ జయంతి సందర్భంగా ఆయన ఘనంగా నివాళులు అర్పిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అంటూ తెలుగు జాతికి అభ్యుదయ భావాలను, విశాల దృక్పథాన్ని అందించిన మహనీయుడు గురుజాడ అని కొనియాడారు. 'కన్యాశుల్కం' వంటి నాటకం ద్వారా ఆనాడు సాంఘిక దురాచారాలపై ధైర్యంగా గళం విప్పి, సంఘ సంస్కరణకు బాటలు వేసిన ఆయన ఆశయాలు నేటి తరానికి ఎప్పటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. మహాకవి గురుజాడ వారసులకు గతంలో నిలిచిపోయిన గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరించిందని, ఆ మహోన్నత మూర్తిని ప్రభుత్వం సగౌరవంగా స్మరించుకుంటోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఇది కూటమి ప్రభుత్వానికి సాహిత్య, సాంస్కృతిక రంగాల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిలువెత్తు తార్కాణమని తెలిపారు. అటువంటి మహాకవి ఆశయాలను, ఆయన చూపిన మార్గాన్ని ముందుకు తీసుకెళ్లడమే మనందరి కర్తవ్యమని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## దైవాలపై దాడులా..?



**పెనుకొండ, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** గురువులను దైవంగా కొలిచే సమాజంలో ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం క్షమించరాని నేరమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని, స్పోర్ట్స్ కోటాతో పాటు ఇతర అంశాలపై కూడా హైకోర్టు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చారని తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో అభ్యర్థులు ఎంతో కష్టపడి ఉద్యోగాలు సాధించారని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల హామీ మేరకు మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించారని పేర్కొన్నారు. జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. లిక్కర్ కేసులు, గ్రూప్-1 మూల్యాంకనంపై ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మంత్రి ఆరోపించారు.

విజయవాడ ఘటనతో పాటు ఉపాధ్యాయులు, సామాన్యులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సవిత హెచ్చరించారు. గ్రూప్-1 మూల్యాంకనంలో దిద్దుబాట్లకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికలో అంశాలు వెలుగులోకి వచ్చాయని, వాటిపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు జగన్ రాజకీయ వ్యూహాలకు పావులుగా మారవద్దని సూచించారు. ఆయన మాటలు నమ్మి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత ఈ వ్యాఖ్యలు చేశారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్ వద్ద నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తల సమక్షంలో 38 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గత రెండున్నరేళ్లలో నియోజకవర్గం నుంచి 592 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 480 మందికి రూ.4.81 కోట్ల సాయం అందించినట్లు తెలిపారు. మరో 100కు పైగా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, త్వరలో వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎవరూ సిఫారసు చేయాల్సిన అవసరం లేదని, ఒక్క పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేస్తే నిబంధనల ప్రకారం పరిశీలించి సాయం అందిస్తామని స్పష్టం చేశారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

- రాంపల్లి చెరువు, షామీర్‌పేట్ చెరువులో ఏర్పాట్ల పరిశీలన..
- భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత..



హైదరాబాద్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : గణేష్ నిమజ్జనాన్ని సురక్షితంగా, సాఫీగా, పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత జోనల్ కమిషనర్లతో కలిసి రాంపల్లి చెరువులోని నిమజ్జన పాయింట్లు – 1, 2తో పాటు షామీర్‌పేట్ చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ నిమజ్జన కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, షిఫ్ట్‌ల వారీగా విధుల కేటాయింపు, సిబ్బంది హాజరు, వివిధ శాఖల మధ్య సమన్వయం, భక్తుల రాకపోకలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గణేష్ నిమజ్జన సమయంలో భక్తులు, ప్రజలు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**నిమజ్జన కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం :** నిమజ్జన ప్రాంతాలకు వచ్చే భక్తులు, విధుల్లో ఉన్న సిబ్బందికి తాగునీటి సౌకర్యాన్ని నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా అవసరమైనసంఖ్యలో మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసి, నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**భక్తులకు స్పష్టమైన మార్గదర్శకాలు :** నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు మార్గనిర్దేశం చేసేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రవేశం, నిష్క్రమణ, నిమజ్జన ప్రదేశాలు తదితర ప్రాంతాలను స్పష్టంగా గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

**భద్రతకు ప్రత్యేక చర్యలు :** అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు శిక్షణ పొందిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన క్రేన్లు, వైద్య సదుపాయాలు, అత్యవసర సహాయక బృందాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**విద్యుత్ వెలుగులు, అప్రోచ్ రోడ్లపై దృష్టి :** నిమజ్జన కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో తగినంత విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయడంతో పాటు, నిమజ్జన పాయింట్లకు వెళ్లే అప్రోచ్ రోడ్లను సక్రమంగా అభివృద్ధి చేసి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**కంట్రోల్ రూమ్ ద్వారా శాఖల సమన్వయం :** అన్ని శాఖల మధ్య నిరంతర సమన్వయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, నిమజ్జన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై తక్షణ స్పందన ఉండేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా విధుల్లో నియమించి, ఎలాంటి గైర్హాజరు లేకుండా నిరంతర సేవలు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత :** నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. పూలు, ఆకులు మరియు ఇతర పచ్చ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి, వేరు చేసి డీకంపోజ్ చేసి సహజ ఎరువుగా మార్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ఇతర వ్యర్థాలను సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో తరలించి, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు చర్యలు :** నిమజ్జన సమయంలో భారీగా భక్తులు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, భక్తుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని కమిషనర్ సూచించారు. గణేష్ నిమజ్జన ప్రక్రియ మొత్తం సురక్షితంగా, సాఫీగా, పరిశుభ్రంగా, పర్యావరణహితంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా చెరువులు, వాటి పరిసర పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీల్లో జెడ్సీలు సంచిత్ గంగ్వార్ ఐఏఎస్, రాధికా గుప్తా ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్లు వాణి, రామలింగం, సూపరింటెండెంట్ ఇంజినీర్లు లక్ష్మణ్, రమేష్ బాబు, డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటేషన్ సిబ్బంది తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు..

# ఘనంగా గణనాథుడి వీడ్కోలు..

## ఉప్పల్ భగాయత్‌లోని హర్షం అపార్ట్‌మెంట్‌లో నిమజ్జన వేడుకలు..

- నల్లచెరువు వరకు వైభవంగా సాగిన శోభాయాత్ర..
- వారం రోజులపాటు విశేష పూజలు.. అన్నదానం..

హైదరాబాద్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఉప్పల్ భగాయత్ పరిధిలోని హర్షం అపార్ట్‌మెంట్‌లో గణేశ్ నిమజ్జన వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. గత సోమవారం అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో కొలువుదీరిన లంబోదరుడికి నివాసితులు వారం రోజులపాటు నిత్య పూజలు, హారతులు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఏడు రోజుల వేడుకలు ముగియడంతో భక్తులు బొజ్జగణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.

**కన్నులపండువగా శోభాయాత్ర..:**
నిమజ్జనోత్సవాన్ని పురస్కరిం చుకుని హర్షం అపార్ట్‌మెంట్ నుంచి ఉప్పల్ నల్లచెరువు వరకు గణనాథుడి శోభాయాత్ర కన్నులపం డువగా సాగింది. వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ చిన్నారులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. 'జై గణేశా.. జై జై గణేశా' అంటూ చేసిన జయజయధ్వానాలతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం నల్లచెరువులో విగ్రహాన్ని శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు.

**వందలాది మందికి అన్నదానం..:** వేడుకల్లో భాగంగా అపార్ట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు వందలాది మంది పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అపార్ట్‌మెంట్ వాసులంతా ఏకతాటిపైకి వచ్చి ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హర్షం వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ ఇటికాల సుధాకర్ రెడ్డి, ప్రతినిధులు రాజలింగం, రాములు యాదవ్, శశికాంత్, రాము, గంద్ర నవీన్, శ్రీధర్, వాసురావు చౌదరి, ఆనంద్, ప్రశాంత్, డాక్టర్ సందీప్, శివ ప్రసాద్, ప్రసన్న, ప్రణయ్ ప్రవీణ్ ప్రవీణ్, శివయ్య పాల్గొన్నారు..



# చిన్న రావిరాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చింతల మోహన్ రెడ్డి..

అబ్దుల్లాపూర్ మెట్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాను సారం అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని చిన్న రావిరాల గ్రామం లో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాసు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ కమిటీ, యువజన కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. చిన్న రావిరాల గ్రామ శాఖ అధ్యక్షులుగా చింతల మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బంగారి సత్య నారాయణ, సద్దుపల్లి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కండికోట శివశంకర్ రెడ్డి, కోశాధికారిగా శేఖర్ రెడ్డి తోపాటు పలువురిని నియమించారు.

యువజన కాంగ్రెస్ విభాగంలో యువజన గ్రామ అధ్యక్షులుగా కారెడ్డి అమూల్ రెడ్డి, ఉపాధ్య క్షులుగా బండారి శివ, ప్రధాన కార్యదర్శిగా ఒంటేదు శ్రీనివాస్, కోశాధికారిగా శివ, కార్యదర్శిగా సంపంగి అనిల్ ని నియమిం చడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ మాట్లా డుతూ.. గ్రామంలో పార్టీని మరింత బలో పేతం చేయడం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసు కెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు భాస్కరా చారి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రణీత్ యాదవ్, గ్రామ సర్పంచ్ కిషన్ గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, సీనియర్ నాయకులు కొలను రవీందర్ రెడ్డి, లింగారెడ్డి, ధర్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఏసీఈ అజంత మట్టి గణపతికి

# ప్రపంచ పర్యావరణ సంస్థ అవార్డు..




హైదరాబాద్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో దేశవ్యాప్తంగా మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అన్న నినాదంతో మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుతున్న వివిధ మట్టి గణపతులను అవార్డుతో సత్కరిస్తుంది ప్రపంచ పర్యావరణం సంస్థ.. సంస్థ కార్యవర్గ సభ్యుడు మార్కు విజయ్, నవ్యాల సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు సిహెచ్ భద్ర, వారి బృందం కలిసి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలోని నాగోలు బండ్లగూడలో ఉన్న ఏసీఈ అజంతా అపార్ట్మెంట్ వాసులు గత ఆరు సంవత్సరాలుగా మట్టి గణపతిని పూజిస్తూ సమాజానికి సందేశానిస్తున్నారు.. స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలందరినీ ఐక్యం చేయడానికి తమకు స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి, ప్రజల మధ్యలో ఐక్యతను సోదర భావాన్ని, మతసామరస్యాన్ని కాపాడడానికి ఆనాడు స్వాతంత్ర ఉద్యమానికి ప్రాణవాయువు లాగా పని చేసింది. దాని స్ఫూర్తిగా తీసుకొని ఈరోజు దేశంలో, రాష్ట్రంలో ప్రతి బస్తీలో, ప్రతి ఇంట్లో ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తుండిపోయే విధంగా ఈ గణపతి నవరాత్రి మహోత్సవాలు జరుపుకోవడం శుభ పరిణామం.. కానీ ప్రజలు, ప్రభుత్వాలు పూర్తిగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ప్రోత్సహిస్తూ లక్షలాది విగ్రహాలను వాడి సరస్సులలో, నదులలో, సముద్రాల్లో పడేయడం మూలంగా ఈరోజు అనేక రకాల వాతావరణ కాలుష్యానికి కారణం అవుతున్నారు.. ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం ఈరోజు కూడా నమోదు కాకపోగా సూపర్ ఎల్ లోన్ రావడంతో దేశం మొత్తం కూడా కరువు కాటకాలు విలయతాండవం చేస్తున్న ఈ తరుణంలో ప్రజలు కనీసం మట్టి గణపతిని పూజిస్తే కాలుష్యాన్ని తగ్గించే వాళ్ళం అవుతాం.. కానీ పూర్తిగా సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నారు.. దానికి భిన్నంగా అజంతా అపార్ట్మెంట్ వాసులు వారి అధ్యక్షులు కొండలరావు ఆధ్వర్యంలో ప్రకృతి హితంగా, పర్యావరణ పరిరక్షణకు ఈ ఉత్సవాలు సమాజంలో ఉన్న ప్రజలందరికీ ఒక సందేశాన్ని ఇస్తున్న సందర్భంలో.. వారికి ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అవార్డును బహుకరించింది.. రాబోవు రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిగా దేశంలోని ప్రజలందరూ కూడా మట్టి గణపతి పూజించాలని. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ రాజా మనోజ్, హై ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు రవీందర్, సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, కోశాధికారి రిజ్వాన్ అహ్మద్, ఉపాధ్యక్షులు సంతోష్, పవన్ వడ్లకొండ, సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్, ఉపేందర్ యాదవ్, జాతీయ కార్యదర్శి సాగర్ నేత, అపార్ట్మెంట్ వాసులు, అసోసియేషన్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ అభినందనీయం..

- పర్యావరణహిత పేపర్ వినాయకుడిని తయారు చేసిన మనోజ్ కుమార్, వారి బృందానికి ఘన సన్మానం...




హన్మకొండ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పేపర్‌తో అందమైన వినాయక విగ్రహాన్ని రూపొందించిన చందనాల మనోజ్ కుమార్‌ను, ఆయన బృంద సభ్యులను డీసీసీ కార్యవర్గ సభ్యుడు మామిండ్ల సురేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మామిండ్ల సురేష్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి కాలుష్యంతోపాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మట్టి, పేపర్ వంటి పర్యావరణహిత పదార్థాలతో వినాయక విగ్రహాలను తయారు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రజల్లో పర్యావరణ పరి రక్షణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 31వ డివిజన్ ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పేపర్, మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్స హించాలని పిలుపునిచ్చారు. "పర్యావరణాన్ని కాపాడుదాం పర్యావరణహిత వినాయకుడిని పూజిద్దాం'' అని ఆయన అన్నారు. పర్యావరణహిత వినాయక విగ్రహాన్ని రూపొందించిన చందనాల మనోజ్ కుమార్, ఆయన బృంద సభ్యులకు మామిండ్ల సురేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం..

- రచనలకు ఆహ్వానం..
- వివరాలు తెలియజేసిన సురక్ష, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, డా.యం. రమేష్, ఐపీఎస్..



హైదరాబాద్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : దేశం కోసం, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలు అనుభవిస్తున్న వేదనను, త్యాగాల వెనుక ఉన్న కుటుంబ సభ్యుల భావోద్వేగాలను, సమాజం పోలీసు కుటుంబాలకు అందించాల్సిన మద్దతు తెలియజేసేలా ప్రత్యేక కథనాలు, కవితలు, వ్యాసాలు సురక్ష మాస పత్రికలో ప్రచురించేందుకు ఆహ్వానిస్తున్నాము. రచనలు సెప్టెంబర్ 30, 2026లోగా news.surakshadaily@gmail.comకు పంపించవలసిందిగా కోరుతున్నాము.

## ఆర్‌పీఎఫ్ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మల్కాజ్‌గిరి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్‌పీఎఫ్ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి ఆర్‌పీఎఫ్ పోస్టు ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా అవగాహన కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో శ్రమదానం చేపట్టడంతో పాటు మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రయాణికులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించారు. రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం ఆర్‌పీఎఫ్ సిబ్బంది మిర్యాలగూడలోని ఫ్యూచర్ ఫౌండేషన్ హోమ్, మల్కాజ్‌గిరి తుకారం గేట్‌లోని సన్నిహిత గర్ల్స్ హోమ్లను సందర్శించారు. అక్కడి చిన్నారులతో ఆప్యాయంగా మమేకమైన సిబ్బంది, వారికి పండ్లు మరియు బిస్కెట్లను పంపిణీ చేశారు. చిన్నారుల పట్ల ప్రేమ, ఆప్యాయతతో పాటు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఆర్‌పీఎఫ్ సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ప్రయాణికుల భద్రతతో పాటు సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, మానవతా విలువలు మరియు సమాజ సంక్షేమం పట్ల ఆర్‌పీఎఫ్‌కు ఉన్న నిబద్ధతను ఈ కార్యక్రమాలు ప్రతిబింబించాయి.

## గౌతమ్‌నగర్‌లో బీజేపీకి కొత్త బాధ్యతలు..

- పగ్గాలు ఈసం రాకేశ్‌కు..



మల్కాజిగిరి సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : గౌతమ్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఈసం రాకేశ్ నియమితులయ్యారు. మేడ్చల్––మల్కాజిగిరి అర్బన్ జిల్లా పరిధిలో పార్టీకి సంబంధించిన నూతన డివిజన్ అధ్యక్షుల నియామకాల్లో భాగంగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దూరెడ్డి గిరివర్ధన్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్ నెం. 182 గౌతమ్‌నగర్‌లో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడంతో పాటు కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగాల్సిన బాధ్యతను ఈసం రాకేశ్ నిర్వహించనున్నారు. స్థానికంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఈసం రాకేశ్‌కు డివిజన్ అధ్యక్ష పదవి దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన నియామకంతో గౌతమ్‌నగర్‌లో పార్టీ కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగుతాయని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈసం రాకేశ్ తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీని డివిజన్ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## వినాయకులను దర్శించుకున్న కొండవీటి ప్రభాకర్ రెడ్డి..



శేర్లింగంపల్లి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందానగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొండవీటి ప్రభాకర్ రెడ్డి ఆదివారం జవహర్ కాలనీ, గంగారాం, డిఫెన్స్ కాలనీ, రాజేందర్ రెడ్డి నగర్, న్యూ శంకర్ నగర్, శంకర్ నగర్ ఫేజ్–2, సురక్ష కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయకులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్న కాలనీ వాసులను ఆయన అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమల వినియోగం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరిపై వినాయకుడి ఆశీస్సులు ఉండాలని, కాలనీ వాసులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆయా కాలనీ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమాల్లో కొండవీటి ప్రభాకర్ రెడ్డి పాల్గొని, కాలనీ వాసులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

# ప్రభుత్వ విద్యారంగ మనుగడ కోసం పోరాటం

- టిఎస్ యూటిఎఫ్ 7వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు
- డిసెంబర్ 26,27,28 తేదీల్లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలి
- పిలుపునిచ్చిన చావా రవి, అలుగుబెల్లి నర్సిరెడ్డి



కొత్తగూడెం సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ విద్యారంగ మనుగడ, పరిరక్షణకోసం నిరంతరాయంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 7వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ అన్నారు. ప్రతిరెండు సం వత్సరాలకు జరిగే రాష్ట్ర మహాసభలు ఈ సంవత్సరం డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్త గూడెంలో గల కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న సందర్భంగా ఆది వారం రాష్ట్రమహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం చుంచుపల్లి, విద్యానగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్లో జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ అధ్యక్షతన జరి గింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ మనుగడ కోసం, పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే తెలంగాణ రాష్ట్రఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. గతప్రభుత్వంఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలతో అధికారంలోకివచ్చిన కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టీచర్స్ సమస్యలు పరిష్కరించ కుండా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఉపాధ్యాయులు వారి సమస్యలు, హక్కుల కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం జిల్లా పోరాటాల గడ్డపై జరగనున్న మహాసభలు ఇప్పటి వరకు జరిగిన రాష్ట్రమహాసభలకు ధీటుగా జరగాలని కోరారు. ఆహ్వాన సంఘం ఏర్పాటు.. టీఎస్ యుటిఎఫ్ 7వ రాష్ట్ర మహా సభల సందర్భంగా మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘాన్నిఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులుగా కోనేరు పూర్ణచంద్రరావు, కార్య నిర్వాహక అధ్యక్షులు బి.రాజు, ప్రధానకార్యదర్శి ఎం.వెంకటే శ్వర్లు, కోశాధికారి మురళీమోహన్, చీఫ్‌ప్యాట్రన్, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎఐటియుసి నాయకులు ఎస్‌కె.సాబీర్‌పాషా, భూక్యా శాంతి, వాసిరెడ్డి మురళీ, అమరనేని రామారావు, వెంకట పుల్లయ్య, రమేష్‌కుమార్ మక్కడ్, ప్రభుదయాల్, భార్గవ్‌చైతన్య, టి,మాధవరావు, నీరజ, బాలాజీ, పద్మలత, మంగీలాల్, దుర్గభవాని, సమ్మారావు, మల్లారెడ్డి, నాగే శ్వరరావు, నరసింహారావు, రాందాస్, కిషోర్‌సింగ్, వెంకటేశ్వర్లు, వరలక్ష్మీ, రాజయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్, వీరబాబు, నాగమల్లేశ్వర రావు, నాగేశ్వరరావు, గౌర సలహాదారులుగా ఎమ్మెల్యేలను తీసుకోవడం జరిగింది. వీరితోపాటు జిల్లా ఆఫీస్ బేరర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సబ్ కమిటీల కన్వీనర్లు కార్యదర్శు లుగా ఉంటారు. ఈ సమావేశంలో వెంకట్, దుర్గాభవాని, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రంజిత్‌కుమార్, శ్రీధర్, సింహాచలం, వెంకటప్ప, రవికుమార్, సమ్మారావ్, నాగేశ్వరరావు, వెంకటేశం,

# గౌతంపూర్‌లో మహాఅన్నదానం

- హాజరైన పోలీసు అధికారులు



కొత్తగూడెం సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : గౌతంపూర్ 8 ఇంక్లైన్‌లోని శ్రీసిద్ధివిఘ్నేశ్వర స్వామి వారిమండపం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ఆదినారాయణ, 1టౌన్ సిఐ కరుణాకర్, 3టౌన్‌సిఐ ఇంద్రసేనారెడ్డి, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్, 2టౌన్‌ఎస్ఐ రాజశేఖర్ హాజరై శ్రీసిద్ధి విఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు పోలీసు అధికారులను శాలువాలతో సత్కరించి, మెమోంటో లను అందచేశారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈకార్య క్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రశాంతంగా భక్తి వాతావరణంలో కొనసాగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సిద్ధివిఘ్నేశ్వరస్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాల తో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# సేవా దృక్పథంతోనే ఆదర్శ సమాజ నిర్మాణం

- ఆధ్యాత్మికతతో కూడిన సేవాభావం అభినందనీయం
- అన్నదానం భిన్నవర్గాల మధ్య ఐక్యతను పెంచుతుంది
- బేధభావాలను వీడి కలిసికట్టుగా ఉత్సవాలు జరుపుకుందాం : సాబీర్‌పాషా

కొత్తగూడెం సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఆధ్యాత్మిక భావనతోపాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించనప్పుడే పండుగల పరమార్థం నెరవేరుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. గణేష్‌నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ ఎన్ఎంసిసి ఆధ్వర్యంలో, 30వ డివిజన్ గొల్లగూడెం, 29వ డివిజన్ ప్రగతినగర్, 26వ డివిజన్ మధురబస్తీలలో ఆది వారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాలకు మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆయా మండపాల్లో కొలువుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమానత్వానికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే వినాయక చవితి వేడుకల్లో అన్నదానంవంటి మహత్తర సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలంతా వర్గ, వర్ణ, బేధాలు విడనాడి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి,



పేదలకు బాసటగా నిలిచే సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు దాసరి శ్రీనివాస్, దర్గయ్య, నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, సమైక్య, పి.సత్యనారాయణాచారి, మాచర్ల శ్రీనివాస్, రమేష్, రాజు, కసరబోయిన రమేష్, లక్ష్మీనారాయణ, పసుపులేటి భరత్, అజయ్, సాంబ, చోటు, షరీఫ్, అంజన్‌రావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

# గొర్రెల మందపై పిడుగు పాటు.. 15 గొర్రెలు మృతి

జగిత్యాల సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం రామారావుపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిలువేరి మహేష్కు చెందిన గొర్రెల మందపై పిడుగు పడటంతో సుమారు 15 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటనలో దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఘటనతో గొర్రెల యజమాని మహేష్ తీవ్రంగా నష్టపోయాడు. ప్రభుత్వం స్పందించి పిడుగు పాటుతో మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.



# ముదిరాజులను బిసిలోకి చేర్చడానికి సహకరించాలి

- బీజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రరావుకు ముదిరాజ్ జాక్ వినతి



కొత్తగూడెం సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ముదిరాజులను బీసిలోకి చేర్చడానికి సహకరించాలని ముదిరాజ్ జాక్ కోరారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసి డి నుంచి బీసి ఏలోకి చేర్చడానికి, రాష్ట్రంలోని అన్ని పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌తార్నకలో బీజెపి తెలంగాణరాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును ముదిరాజ్ జేఏసి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ముదిరాజ్ జేఏసి అడ్‌హక్ కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్‌సామాజికవర్గం బిసి ఏలోకి చేరక పోవడంతో అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందలేక ముదిరాజ్ బిడ్డలు వెనుక పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాక్ వైస్‌చైర్మన్ పులి దేవేందర్ ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, అల్లదుర్గం సురేష్, మోరం రవికాంత్ ముదిరాజు మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గం విద్య ఉద్యోగాల్లో తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే బిసిడి నుంచి బీసిఏలోకి మార్చాలని గతంలో ఉన్న జిఓ ఎంఎస్‌నెం 15ను అమలు చేయాలని కోరారు. అధికార పార్టీ అసెంబ్లీలో బీసి లోకిమార్చేందుకు రాష్ట్రప్రభుత్వంతో కొట్లాడి బిల్లు పెట్టించేలాగా చూడాలనికోరారు. ముదిరాజ్‌లకు కామారెడ్డిలో ఇచ్చిన మాటకు కట్టుబడిఉండాలని లేని పక్షంలో గ్రామస్థాయిలో ముదిరాజ్‌లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, ఇప్పటికైనా అక్టోబర్ 22న జరిగే పండుగ సాయన్నజయంతి లోపు ముదిరాజ్‌లను బీసీఏలోకి మార్చాలని కోరారు. ఈకార్యక్రమంలో శ్రీను, దేవేందర్, మల్లిఖార్జున్, జాన్, అనసూయమ్మ, శేఖర్, శ్రీనివాస్, వివిధ జిల్లాల ముదిరాజ్ జాక్ బాధ్యులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న

- పలు గణేషుని మండపాల్లో అన్నదాన కార్యక్రమం
- పాల్గొన్న కొత్వాలతోపాటు కార్పొరేటర్ విమలాదేవి



పాల్వంచ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని అన్నదానం ఎంతో పవిత్రమైనదని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుఅన్నారు. గణపతి నవరాత్రి మహొత్సవాల సందర్భంగా దివారం పాల్వంచలోని పలుమండపాల వద్ద ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పాతపాల్వంచలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో కొత్వాలతోపాటు ఆయన సతీమణి, 46వ డివిజన్‌కార్పొరేటర్ విమలాదేవి పాల్గొని కార్యక్రమాన్నిప్రారంభించారు. గడియకట్ట వద్ద జిడికిటీమ్ ఆధ్వర్యంలో, మంగబావి వీధియూత్ శక్తీయూత్,గౌడ్స్‌బజార్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో, పట్టణంలోని గట్టాయిగూడెం, టల్లోరిగూడెం, హైస్కూల్‌రోడ్డులో ఏకదంతయూత్, రాంనగర్‌కాంట్రాక్టర్స్ కాలనీలోని పలు చోట్ల జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని గణేషుడు అన్ని విఘ్నాలు తొలగించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బాలునాయక్, జయలక్ష్మీ, సరిత, సుగుణ, భాగ్యలక్ష్మీ, కీర్తి, జలీల్, ముత్తయ్య, సత్యనారాయణ, రామకృష్ణారావు, మహేష్, నాగరాజు,కేషులాల్‌నాయక్, శ్రీనివాసరావు, రాము, దస్తగిరి, పండు, శ్రీను, నాని, లక్ష్మణ్, రోజాలక్ష్మీ, మధు, వీరకుమార్, వెంకటరత్నం, బాలు, సతీష్,తేజ, అన్వేష్, సాగర్, ప్రశాంత్, నాగరాజు, మణికంఠ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- సామాగ్రి, సర్టిఫికెట్లు బూడిద.. తప్పిన ప్రాణనష్టం

పాల్వంచ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : మున్సిపాల్టీ పరిధిలోని కరకవాగు గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు అగ్ని ఆహుతి అయ్యింది. మొహమ్మద్ ముబీన్‌కుచెందిన ఇంట్లో రాత్రి పెద్ద శబ్దం రావడంతో పొరుగింటి మహిళల బయటకు వచ్చి చూడగా అప్పటికే మంటలు ఎగిపిపడుతున్నాయి. వెంటనే ఆమె ముబీన్ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కొత్తగూడెం నుంచి ఫైరింజన్ చేరుకునేలోపే ఇంట్లోని సామాగ్రితోపాటు పిల్లల ఒరిజనల్ సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరూ లేక పోవడంతో ప్రాణనష్టం తప్పింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జనం

- భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదం..



కడ్తాల్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో సేవాలాల్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు,కడ్తాల్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు జర్పుల లక్పతి నాయక్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ లడ్డూ ప్రసాదం వేలం ఉత్సాహంగా సాగింది. మొదటి లడ్డూను రూ.20 వేలతో రాజశేఖర్ రెడ్డి (రాజబాబు) దక్కించుకోగా,రెండో లడ్డూను రూ.13 వేలతో జర్పుల వెంకటేష్ నాయక్ కైవసం చేసుకున్నారు. వేలంలో భక్తులు,యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు భీక్య నాయక్,సర్పంచులు రాయికంటి భిక్షపతి,సేవ్యా నాయక్,సేవాలాల్ సేన రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు నాయక్,మండల ఉప సర్పంచుల సంఘం కార్యదర్శి రమేష్ నాయక్,రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు చందోజీ,మాజీ ఉప సర్పంచ్ పాండు నాయక్,జిల్లా గిరిజన నాయకులు లక్ష్మణ్ నాయక్,వార్డు సభ్యులు నాగార్జున్,రాజు,కడ్తాల్ మండల సేవాలాల్ సేన యువజన అధ్యక్షులు తేజు నాయక్,సాధు సేవా సంఘం అధ్యక్షులు రాజు నాయక్,గణేష్ కమిటీ అధ్యక్షులు విఘ్నేష్ నాయక్,నాయకులు కడారి రమేష్,దేశ్య నాయక్,సక్రు,రాజేష్,కృష్ణకాంత్,అర్జున్ తో పాటు యువకులు,విద్యార్థులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొగ్గు గనుల వేలంపాటలో సింగరేణి పాల్గొనాలి

- కార్మికుల ఉద్యోగ భద్రతను కాపాడాలి : బిఎంఎస్ డిమాండ్




గోదావరిఖని, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న 26వ విడత దేశవ్యాప్త బొగ్గు గనుల వేలంపాటలో సింగరేణి యాజమాన్యం తక్షణమే పాల్గొని, సంస్థకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లను దక్కించుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) డిమాండ్ చేసింది. గోదావరిఖనిలోని బిఎంఎస్ కేంద్ర కార్యాలయంలో ఏరియా ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య మాట్లాడారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సెప్టెంబర్ 17న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జరగబోయే ఈ వేలంలో ఇల్లందు-కోయగూడెం ఓసిపి, మందమర్రి-శ్రావణ పల్లి ఓపెన్ కాస్ట్ వంటి కీలక బ్లాక్‌ల కోసం సింగరేణి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణి భవిష్యత్తు,వేలాది మంది కార్మికుల ఉద్యోగ, సామాజిక భద్రత నూతన గనుల కేటాయింపుపైనే ఆధారపడి ఉన్నాయని నాయకులు స్పష్టం చేశారు. పారదర్శక బిడ్డింగ్ విధానంలో సింగరేణి భాగస్వామ్యం కావచ్చని పార్లమెంట్ వేదికగా కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసిందని తెలిపారు. ఈ విషయమై బిఎంఎస్ నాయకత్వం ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలవగా, సింగరేణి టెండర్లలో పాల్గొంటే బ్లాక్‌లు దక్కేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం చేతులు ముడుచుకుని కూర్చోకుండా అవసరమైన ఆర్థిక, సాంకేతిక,న్యాయపరమైన అంశాలను సమన్వయం చేసుకుని సమగ్ర బిడ్డింగ్ వ్యూహంతో ముందుకు వెళ్లాలని కోరారు. కేంద్ర మంత్రి హామీని సొమ్ము చేసుకుంటూ, తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే చొరవ తీసుకుని యాజమాన్యానికి అవసరమైన మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శి మేడ రామ్మూర్తితో పాటు పల్లె శ్రీనివాస్,గంగిశెట్టి నరసింహులు, నీలం శ్రీనివాస్, మేడ అజయ్ కుమార్,బొజ్జపల్లి నాగరాజు, ఆర్.ఎల్.వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్విఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం

కోహెడ, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : "తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంఘం" (TRVS) సిద్ధిపేట జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శిగా.. కోహెడ మండలం, బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడెం లింగం నియామకాన్ని మహమ్మద్ మున్నా (స్థాపక అధ్యక్షుడు), షేక్ నయీమ్ (రాష్ట్ర అధ్యక్షుడు) మరియు పార్స ఆంజనేయులు (రాష్ట్ర ఉపాధ్యక్షుడు) ప్రకటించారు. దివ్యాంగులకు సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ సమానత్వాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా TRVS స్థాపించబడింది. దివ్యాంగుల హక్కులు మరియు సంక్షేమం కోసం పోరాడుతూ.. వారి అభ్యున్నతికి ఈ సంస్థ కృషి చేస్తోంది.

జాతీయ, రాష్ట్ర స్థాయిలలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఈ సంస్థ, 'దివ్యాంగుల హక్కుల చట్టం (2016)', పెన్షన్ పెంపు, అలాగే ఉపాధి మరియు జీవనోపాధి సమస్యల పరిష్కారం వంటి కీలక విజయాలను సాధించడంలో తనవంతు పాత్ర పోషించింది. దివ్యాంగుల ఆత్మగౌరవం, హక్కులు మరియు సంక్షేమాన్ని కాపాడేందుకు నిరంతరం కృషి చేయడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి TRVS అంకితభావంతో పనిచేస్తోందని వారు పేర్కొన్నారు.

## వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు

# నిర్వహించిన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

- విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



జవహర్‌నగర్, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్, జవహర్‌నగర్ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ సందర్శించారు. మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తాను ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు.

వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు మండపాల వద్ద అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మండపాలను సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహిస్తూ, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లావణ్య సతీష్ గౌడ్, గొడుగు వేణు ముదిరాజ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్, స్థానిక నాయకులు అశోక్ గుప్తా, వెంకటయ్య యాదవ్, యాదగిరి యాదవ్, నవీన్, శివతో పాటు ఆయా వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# మాణికొండలో ఘనంగా అన్నప్రసాద వితరణ

మణికొండ, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : మాణికొండ క్వార్టర్స్ ప్రాంతంలో దివ్య జ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. స్థానిక నిరుపేదలు, బాటసారులు మరియు కార్మికుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా యువత ముందుకొచ్చి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... సమాజ సేవలో భాగస్వామ్యం కావడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సామాజిక మరియు సేవా కార్యక్రమాలను దివ్య జ్యోతి యూత్ అసోసియేషన్ తరఫున కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# కేజీబీవీ హాస్టల్ నుంచి విద్యార్థిని అదృశ్యం

ఓదెల, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : మండలంలోని కేజీబీవీ హాస్టల్ నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆదివారం అదృశ్యమైంది. తెల్లవారుజామున 3.40 గంటలకు స్నానానికి వెళ్తున్న సమయంలో చివరిసారిగా కనిపించగా, ఉదయం 9 గంటలకు టిఫిన్ సమయంలో ఆమె కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. విద్యార్థిని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, హాస్టల్ సిబ్బంది ప్రయత్నించినప్పటికీ సమాచారం లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీమా క్లెయిమ్ చెక్కు అందజేత

ఓదెల, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఓదెల మండలం నాంసంపల్లి గ్రామానికి చెందిన పెనుకుల కొమురయ్య ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన భార్య, నామినీ భాగ్యకు రూ.6.84 లక్షల ప్రమాద బీమా క్లెయిమ్ చెక్కును శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు ఈడీ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందించారు. కొమురయ్య 2022లో ఓజ్జా శ్రీనివాస్, భిక్కు నాయక్ ద్వారా రూ.21,803 విలువైన పాలసీ తీసుకున్నారు. పాలసీ నిబంధనల ప్రకారం 134 నెలల పాటు నెలకు రూ.3,000 చొప్పున రూ.4.02 లక్షల పెన్షన్‌తో కలిపి మొత్తం రూ.10.86 లక్షల బీమా ప్రయోజనం అందనుంది. కార్యక్రమంలో ఏజీఎం రాకేష్, డీఎం శివకుమార్, డీవోలు, సేల్స్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. ఆర్థిక భద్రతకు బీమా కీలకమని ఈడీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

కోహెడ, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) : తంగళ్లపల్లిలో.. పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి చెందిన ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.11,360 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ అభిలాష్ పోలీసులు తెలిపారు.

# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నకార్తీక్ ఫౌండేషన్

**భువనగిరి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని పి.యస్ పంక్షన్ హోల్ నందు భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారు ఆదివారం దక్షణ భారతదేశం లోని ఐదు రాష్టాలలోని రక్తదాతలకు సామాజిక కార్యకర్తలకు 2026 ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు.. అందులో భాగంగా బాపట్ల జిల్లా వేమూరు మండలం, కోడిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ ఫౌండేషన్ ఫౌండర్ డా. నండూరి కార్తీక్ ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం 2026 ను అందుకొన్నారు. ఈ కార్యక్రమం లో రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ సభ్యులు, వివిధ ప్రాంతాల యన్ జి ఓ ప్రతినిధులు పాల్గొన్నారు.. ఈ పురస్కారం అందుకున్న డా. కార్తీక్ కు తోటి స్నేహితులు, దాతలు, అభిమానులు, ప్రజలు అభినందనలు తెలిపారు.



# శ్రీనివాస నగర్‌లో వైభవంగా గణేష్ ఉత్సవాలుకుంకుమ పూజలు, అన్నదానం.. దాతలకు ఘన సన్మానం

**సూర్యాపేట, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**





కోదాడ పట్టణంలోని 30వ వార్డు శ్రీనివాస నగర్‌లో మదర్ తెరిసా సేవా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ వార్షిక గణేష్ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గణేష్ మండపం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం గణపతికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించి భక్తులకు యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి 30వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమా అంజన్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.మదర్ తెరిసా సేవా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతలను, యూత్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, కాలనీ మహిళలు, యూత్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేష్ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మట్టి గణనాథుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..

- **టీచర్స్ కాలనీలో ఘనంగా రెండో వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలు**

**సూర్యాపేట, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**



పట్టణంలోని టీచర్స్ కాలనీలో "మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశంతో రెండో వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.టీచర్స్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ తోట జ్యోతి శ్రీనివాస్, 20వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ జిల్లేపల్లి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్న గణేష్ ఉత్సవ కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు కోడుమూరి ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు చెన్నకేశవరావుతో పాటు కమిటీ సభ్యులను అభినందించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు.ఈ సందర్భంగా మహిళలు, కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపై గణనాథుని కృపాకటాక్షాలు ఉండాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# పీజేఆర్ స్టేడియంలో 70వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విజేతలకు రామప్రభుచే బహుమతుల ప్రదానం..

**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**





పాఠశాల స్థాయి జోనల్ క్రీడోత్సవాలు పీజేఆర్ స్టేడియంలో ఘనంగా ముగిశాయి. గత నాలుగు రోజులుగా నిర్వహించిన 70వ ఎస్‌జీ ఎఫ్ క్రీడా పోటీల్లో వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో బహుమతులను అట్టేపల్లి రామప్రభు స్పాన్సర్ చేశారు.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, ఆత్మవిశ్వాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని రామప్రభు తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని కూడా క్రీడా స్ఫూర్తితో స్వీకరించి, ఎక్కడ తప్పిదం జరిగిందో తెలుసుకుని తదుపరి పోటీల్లో విజయాన్ని సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సిద్దనబోయిన పురుషోత్తం యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, క్రీడలను సమతుల్యంగా కొనసాగిస్తూ తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల సూచనలు ఎంతో విలువైనవని, వారి మార్గదర్శకత్వాన్ని గౌరవించి పాటించాలని సూచించారు.అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులు, జట్లకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సిద్దనబోయిన పురుషోత్తం యాదవ్, అట్టేపల్లి శ్రీరాములు, అట్టేపల్లి పురుషోత్తం, నాగిశెట్టి వినీత్, సయ్యద్ ముజీబ్, మొహమ్మద్ సమీర్, శేఖర్, ప్రశాంత్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ నిర్మల , పి ఇ డి లు జయపాల్ రెడ్డి, కేశవ్ రెడ్డి, మహిపాల్, మహేష్, వెంకట్, అమర్నాథ్ లతో పాటు ఆయా పాఠశాలల పి ఈ టిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం సాలార్జంగ్‌పేట ఈద్గా వద్ద ముస్లింల సామూహిక ప్రార్ధనలు

**సూర్యాపేట, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**





పట్టణంలోని సాలార్జంగ్‌పేట ఈద్గా వద్ద ముస్లింలు వర్షాల కోసం ప్రత్యేక సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాల కారణంగా ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎ దుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక దువా చేశారు.రాబోయే రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలకు సాగునీరు అందడంతో పాటు ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రార్ధించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి మానవాళికి ఉపశమనం కలగాలని, అల్లాహ్ కృప సర్వమానవాళిపై ఉండాలని కోరుతూ మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని, ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను కాపాడాలని ప్రార్ధిస్తూ ముస్లింలు సామూహిక దువాలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

- **ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువుల ఆక్రమణలను తొలగించాలి**
- **నిర్లక్ష్య అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి**
- **జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసీ కమిషనర్లకు దళిత చైతన్య సంఘం వినతి**

**హైదరాబాద్ సెప్టెంబరు 21(జర్నలిస్ట్ ఫైల్) :**



హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో భారీగా పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు, నాలాలు, చెరువుల ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ కోరారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు.హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం, ప్రభుత్వ భూములను ఆక్రమించడం, నాలాల సహజ ప్రవాహానికి అడ్డంకులు సృష్టించడం, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రజల నుంచి ఫిర్యాదులు, మీడియా కథనాలు, సామాజిక సంస్థల వినతులు వస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అధికారులు సమర్థవంతంగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు జారీ చేయడం, జలమండలి అధికారులు తాగునీరు డ్రైనేజ్ కలెక్షన్ ఇవ్వడం అధికారుల అవినీతితో ఆక్రమణలు మరింత పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల భవిష్యత్తులో వరదలు, ట్రాఫిక్ సమస్యలు, పర్యావరణ నష్టం వంటి సమస్యలు తీవ్రతరం కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.అక్రమ నిర్మాణాలకు విద్యుత్, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లు, వాణిజ్య అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసి) వంటి పౌర సేవలు మంజూరు చేయకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లోని అక్రమ కట్టడాలపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తులు, సంస్థలు, బిల్డర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో అవినీతి అక్రమాలకు,నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని కోరారు.ఆక్రమణలపై అధికారులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయడంతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నవీన్ కుమార్ మాదిగ తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, ప్రజా ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

# గురువుల కష్టార్జితంపై 'ఫేక్' ముద్ర వేయడం సరికాదు

○ మెగా డీఎస్సీ నియామకాలపై ప్రతి ఆరోపణకూ ఆధారాలతో సమాధానం ఇస్తాం : మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమరావతి, సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి, నిబంధనల ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిని 'ఫేక్' అంటూ అవమానించడం సరికాదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేలాది మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తగదని పేర్కొన్నారు.
విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై మంత్రి స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధ మార్గాల్లో నిరసన తెలియజేయవచ్చని అన్నారు. అయితే నిరసనలు భౌతిక ఘర్షణలకు దారితీయకూడదని స్పష్టం చేశారు. ఘటనలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.
**మెగా డీఎస్సీ.. పారదర్శక నియామక ప్రక్రియ :** మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, ఆన్సర్ కీలు, మెరిట్ జాబితాలు, అభ్యంతరాల స్వీకరణ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, తుది ఎంపిక వరకు నిర్దేశిత విధానాలను అనుసరించినట్లు మంత్రి తెలిపారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉపాధ్యాయ నియామకాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు, ఆర్థిక భరోసాను కల్పించాయని అన్నారు.
నియామక ప్రక్రియపై ఎవరికైనా నిర్దిష్ట అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలను అధికారుల ముందుంచాలని సూచించారు. ప్రతి అభ్యర్థి అర్హతను నిబంధనలు, అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించే వ్యవస్థ ఉందని, తప్పు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.
**స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల గౌరవాన్ని దెబ్బతీయొద్దు :** స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ.. నిర్దిష్ట ధ్రువపత్రాలపై అనుమానాలుంటే వాటిని అధికారికంగా పరిశీలించవచ్చని మంత్రి అన్నారు. అయితే ఆధారాలు లేకుండా మొత్తం స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంపికైన అభ్యర్థులందరినీ 'ఫేక్'గా చిత్రీకరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు.
సంబంధిత అధికారులు కూడా స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, టెట్ అర్హత, ఇతర ధ్రువపత్రాలను అధికారిక రికార్డుల ఆధారంగా వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నారని తెలిపారు.
క్రీడల్లో ప్రతిభ కనబరిచి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఒక నిర్దిష్ట అంశంపై అనుమానం ఉంటే దానిని పరిశీలించాలి కానీ, దాని ఆధారంగా మొత్తం నియామక ప్రక్రియను అనుమానాస్పదంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.
**విజయవాడ ఘటనపై చట్టప్రకారం చర్యలు :** శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా విభేదాలు, వాదోపవాదాలు సహజమే అయినా అవి శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని అన్నారు.
"మేము చదువుకున్నాం.. కష్టపడ్డాం.. నిబంధనల ప్రకారం ఉద్యోగాలు సాధించాం.. మా ఉద్యోగం మా కష్టార్జితం" అని ఉపాధ్యాయులు చెబుతున్నప్పుడు వారి వాదనను కూడా వినాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.
ఉపాధ్యాయులు సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే వారని, వారే రాజకీయ ఘర్షణల్లో బాధితులుగా మారే పరిస్థితి రావడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి వాస్తవాలను పరిశీలించి, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
**గ్రూప్-1 వ్యవహారంపై వాస్తవాలు వెలుగులోకి రావాలి:** గత ప్రభుత్వ హయాంలో జరిగిన APPSC గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకన ప్రక్రియపై SIT సమర్పించిన నివేదికలో పలు విధానపరమైన లోపాలు, దిద్దుబాట్లు, సంతకాలలో వ్యత్యాసాలు వంటి అంశాలు నమోదైనట్లు మంత్రి పేర్కొన్నారు.
SIT పరిశీలించిన 736 రికార్డుల్లో 718 రికార్డుల్లో మార్పులు లేదా ఓవర్‌రైటింగ్ ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. అదే సమయంలో, ఎంపికైన అభ్యర్థుల అసలు జవాబు పత్రాలు మార్చబడినట్లు లేదా తారుమారు చేసినట్లు ఇంకా నిర్ధారించలేదని తాజా కోర్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల ఈ అంశంపై వాస్తవాలను కోర్టు పరిధిలోనే తేల్చాల్సి ఉందని మంత్రి అన్నారు.
నియామక పరీక్షల విషయంలో పారదర్శకత అత్యంత కీలకమని, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ప్రతి నియామక ప్రక్రియలో నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని వాసంశెట్టి సుభాష్ అన్నారు.
"ఉపాధ్యాయుల కష్టాన్ని రాజకీయ వివాదంగా మార్చొద్దు. ఆరోపణలు ఉంటే ఆధారాలు చూపాలి.. విచారణ కోరాలి.. చట్టబద్ధమైన మార్గాల్లో ముందుకు వెళ్లాలి. కానీ కష్టపడి ఉద్యోగం సాధించిన వారి గౌరవాన్ని దెబ్బతీయడం మాత్రం సమర్థనీయం కాదు" అని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



○ జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం అర్జీలను అందజేస్తుంటారని వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ ఎన్ ఎస్ కె ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ డేవిడ్, డ్వామా పిడి శంకర్, జిల్లా విద్యా శాఖాధికారి సలీం భాష, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ అధ్యక్షునికి ఘన సన్మానం



○ ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులకు సత్కారం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలో ఐదేళ్లపాటు(2021-26) ప్రజలకు సేవలందించిన ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో వారి సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. అలాగే మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) చిలేకాంపల్లె వీరనారాయణరెడ్డిని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఐదేళ్లపాటు పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. తన పదవీకాలంలో మండల స్థాయి అధికారులు అందించిన సహకారం మరువలేనిదని, అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు తనకు పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన కుటుంబం కూడా రాజకీయాల్లో ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని వీరనారాయణరెడ్డి తెలిపారు. తన తండ్రి సుమారు 30 ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేశారని తన సోదరులు కూడా సింగిల్‌విండో అధ్యక్ష పదవి నుంచి పంచాయతీ స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. తమ కుటుంబంపై నమ్మకం ఉంచి ఆదరించిన ప్రతి ఒక్కరినీ ఎప్పటికీ మరువబోమని అన్నారు. ఎంపీపీగా తనకు పదవి కల్పించేందుకు కృషి చేసిన ఎంపీటీసీ సభ్యులు నాయకులు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీ వీరనారాయణరెడ్డిని మాజీ ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి, మాజీ మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర, ఎంపీపీ సోదరుడు నాగేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, రాజానాయుడు, మన్యం శంకర్‌రెడ్డి, జోగయ్య, నాగిపోగు రవిబాబు, గొల్లపల్లి రవిచంద్ర, శీలం నర్సింహులు గౌడ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాల ఫిర్యాదులకు 48 గంటల్లో పరిష్కారం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో వీధి దీపాలకు సంబంధించి ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును 48 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. వీధి దీపాల సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, జీఎంసీ కాల్ సెంటర్ లేదా క్షేత్రస్థాయి అధికారులకు ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి నిర్ణీత సమయంలో సమస్యను పరిష్కరిస్తామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే 35 వేల ఎల్‌ఈడీ వీధి దీపాలు ఉన్నాయని, వాటి నిర్వహణకు అవసరమైన డ్రైవర్లు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచామని కమిషనర్ తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా డ్రైవర్ల మార్పు, వైరింగ్ సమస్యల పరిష్కారం తదితర పనులను సాంకేతిక సిబ్బంది ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారని చెప్పారు. సాయంత్రం వేళల్లో నగరంలో ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టి పనిచేయని వీధి దీపాలను గుర్తించి, ఉదయాన్నే వాటిని మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. వీధి దీపాల వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

## ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షిక విచారణ.. నిర్ణీత గడువులో పరిష్కారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ స్థాయి అధికారులు, ఇతర పోలీస్ అధికారులు మొత్తం 215 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదులపై నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని, పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.
ప్రతి పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల అభిప్రాయాన్ని తెలుసుకున్న అనంతరం మాత్రమే పిటిషన్‌ను ముగించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణలో పోలీస్ సిబ్బంది సహకారం అందించారు. ఈ సందర్భంగా గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఈస్ట్ డీఎస్పీ టీ. సీతారాం, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, పబ్లిక్ గ్రీవెన్స్ సీఐ బిలాలుద్దీన్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వార్థ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ రఘురాంరెడ్డి

○ ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఫైర్




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి స్వార్థ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలను అవసరానికి ఉపయోగించుకుని ఆ తర్వాత పట్టించుకోకపోవడం ఆయన రాజకీయ నైజమని బ్రహ్మంగారిమఠం ఎంపీపీ చిలేకాంపల్లె వీరనారాయణరెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఎంపీపీ ఎంపీటీసీల పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
తన మంచితనాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారని ఇకపై తన తీరేమిటో చూపిస్తానని హెచ్చరించారు. తన సన్మాన కార్యక్రమానికి కొందరు వ్యక్తులు ఎంపీటీసీలను హాజరు కాకుండా అడ్డుకున్నారని అలాంటి చర్యలకు ఇది హెచ్చరికగా భావించాలని అన్నారు. జడ్పీటీసీ కూడా స్వార్థ రాజకీయాల కోసం గతాన్ని మరిచిపోయారని విమర్శించారు.
నీ వల్ల బాగుపడిన కార్యకర్త ఒక్కరైనా ఉన్నారా?
మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి రాజకీయ తీరుపై వీరనారాయణరెడ్డి ఘాటుగా స్పందించారు. అవసరం ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలను నెత్తిన పెట్టుకోవడం అవసరం తీరిన తర్వాత వారిని పట్టించుకోకపోవడం ఆయన నైజమని ఆరోపించారు. మైదుకూరు నియోజకవర్గంలో రఘురామిరెడ్డి వల్ల రాజకీయంగా బాగుపడిన ఒక్క వ్యక్తినైనా చూపించగలరా? అని ప్రశ్నించారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచడమే ఆయన రాజకీయ విధానమని విమర్శించారు.
కమిషన్ల కోసం పనులు అప్పగించడం, పనులు పూర్తయిన తర్వాత బిల్లులు రాకుండా అడ్డుకోవడం ఆయన నైజమని ఆరోపించారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా కార్యక్రమాలు నిర్వహించాలన్నా, భోజనాలు ఏర్పాటు చేయాలన్నా, సభలు, సమావేశాలకు ప్రజలను తరలించాలన్నా, వాహనాలు సమకూర్చాలన్నా తన సొంత డబ్బుతోనే చేశానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ సుమారు రూ. 50 కోట్ల వరకు ఖర్చు చేసి అప్పుల పాలయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ఇస్తున్నట్లు ఇచ్చి, వాటికి సంబంధించిన బిల్లులు రాకుండా మాజీ ఎమ్మెల్యే అడ్డుపడ్డారని వీరనారాయణరెడ్డి ఆరోపించారు. పాము తన పిల్లలను కని, కళ్లకు కనిపించక తన పిల్లలనే కరిచినట్లు రఘురాంరెడ్డి వ్యవహారశైలి ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు.
ఒక వ్యక్తి రాజకీయాల్లోకి రావాలంటే ముందుగా తనకు కావాల్సిన వనరులను సమకూర్చుకోవాలని అన్నారు. "నీ కడుపులోనే ఆకలి ఉంటే నీ కడుపు నింపుకుంటావా? లేక కార్యకర్తల కడుపు నింపుతావా?" అంటూ ప్రశ్నించారు.
మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రఘురాంరెడ్డి తరహా వ్యక్తి కాదని రాజకీయాల్లోకి రాకముందే ఆర్థికంగా స్థిరపడి, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారని అన్నారు. ఆయన నిజాయితీని చూసే తాను ఆయన వెంట నడుస్తున్నానని వీరనారాయణరెడ్డి తెలిపారు.
అనంతరం ఎంపీపీ వీరనారాయణరెడ్డి మండల అధికారులను ఘనంగా సన్మానించారు. అధికారులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిలో మరో ముందడుగు



○ రూ.45 లక్షల అభివృద్ధి పనులకు చీఫ్ విప్ జీవీ శ్రీకారం


**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని 30వ వార్డు సంజయ్ గాంధీ నగర్‌లో రూ. 35 లక్షలు, 2వ వార్డు సీతయ్యనగర్‌లో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు.
జీవీ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, పార్కులు,అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. అలాగే వినుకొండ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ. 240 కోట్లతో చేపడుతున్న తాగునీటి పథకం పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ జయంతి రాష్ట్ర పండుగగా నిర్వహించడం అభినందనీయం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** మహాకవి గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలు గుంటూరు కొత్తపేటలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ హాజరై గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ జయంతిని రాష్ట్రపండుగగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, సామాజిక చైతన్యానికి గురజాడ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.
1862 సెప్టెంబర్ 21న జన్మించిన గురజాడ అప్పారావు వ్యవహారిక తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేశారని, 'కన్యాశుల్కం' వంటి రచనల ద్వారా సామాజిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని గంగాధర్ తెలిపారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే సందేశం నేటికీ స్ఫూర్తినిస్తోందన్నారు. గురజాడ సాహితీ వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ డీవీఎస్ పవన్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ చలపతిరావు, సభ్యులు పీఎల్ఎన్ మూర్తి, కందుకూరి శ్రీనివాస్, బోస్, కాత్రాపతి చంద్రశేఖర్, తంగిరాల శ్రీనివాస్, కిషోర్, కృష్ణ, తుమ్మలపాటి శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారులు విస్తృతంగా పర్యటించాలి : జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు విస్తృతంగా పర్యటించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు విస్తృతంగా పర్యటించడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో పథకాలు, కార్యక్రమాల అమలు తీరు తెన్నులు గమనించాలన్నారు. లోపాలను గమనిస్తే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మంచి సేవలు అందాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల నుండి అందే అర్జీలు సత్వరం పరిష్కరించాలని, వాటిపై శ్రద్ధ వహించాలని అన్నారు. రీ సర్వే జరిగే ప్రాంతాల్లో ప్రజల ఇకెవైసి గ్రౌండ్ ట్రూతింగ్ సమయంలో కచ్చితంగా చేయాలని ఆదేశించారు. పింఛన్లకు కొత్తగా అందిన దరఖాస్తులు తక్షణం విచారణ చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.
ఎస్.ఐ.ఆర్ లో విచారణ చేపట్టాల్సిన నోటీస్ లపై త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తెలిపారు. వీబీ జి రామ్ జి పథకం కింద వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. ఈ అంశంలో ఇతర జిల్లాలు మెరుగైన ప్రగతి కనబరుస్తున్నాయని తెలిపారు. మన మిత్రలో వచ్చే దరఖాస్తులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. అన్ని రంగాల్లో జిల్లా మంచి ప్రగతిలో ఉండుటకు ప్రతి శాఖ కృషి చేయాలని అన్నారు.
**25న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించాలి**
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహించాలన్నారు. "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం" లో బాగంగా జిల్లాలో గల 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల దాదాపు 4,62,714 మంది బాల బాలికలకు అంగన్వాడీ, ప్రభుత్వ , ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు, విద్యా సంస్థల బయట ఉన్న వారికి, కౌమార బాల బాలికలకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. దీనిని పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.
జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తెలిపారు. గతంలో తయారు చేసిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిందేనని చెప్పారు. కృష్ణ - గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ప్రస్తుత హోదా 2027 మార్చి 29వ తేదీన ముగుస్తుందన్నారు. కృష్ణ - గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల నోటిఫికేషన్ ఈ నెల 28వ తేదీన ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమానికి బహిరంగ నోటీస్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యూ అధికారి రామలింగేశ్వర రెడ్డి, సమన్వయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# 1.12 కోట్ల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు

- సెప్టెంబరు 25న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం
- ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సెప్టెంబరు 25న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన ప్రచార గోడపత్రికను అధికారులతో కలిసి సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 2026 సెప్టెంబరు మలి విడతను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒకటి నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలతో పాటు 6 నుంచి 19 ఏళ్ల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, నర్సింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు బడికి వెళ్లని పిల్లలకూ మాత్రలు అందేలా ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కోసం 1.24 కోట్ల ఆల్బెండజోల్ మాత్రలను సిద్ధం చేశారు. వీటిలో 1.12 కోట్ల మంది పిల్లలకు మాత్రలు అందించనున్నారు. రాష్ట్రంలో నేల ద్వారా వ్యాపించే నులిపురుగుల వ్యాప్తి ప్రస్తుతం 34 శాతానికి తగ్గింది. 2019లో ఎన్‌సీడీసీ గణాంకాల ప్రకారం ఇది 36 శాతంగా ఉంది. నులిపురుగుల నివారణకు 400 మి.గ్రా. ఆల్బెండజోల్ మాత్రలను వినియోగిస్తున్నారు. సెప్టెంబరు 25న మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు మరో అవకాశం కల్పించేందుకు అక్టోబరు 5న మాప్-అప్ డే నిర్వహించనున్నారు.

**నులిపురుగుల వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రభావం:** నులిపురుగుల వల్ల పిల్లల్లో పోషకాలు శరీరంలోకి సరిగా చేరకపోవడం, రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల వారి శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు చదువుపైనా ప్రభావం పడుతుంది. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యం, జీవన నాణ్యత మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరగడానికి దోహదపడుతుంది. 400 మి.గ్రా. ఆల్బెండజోల్ సురక్షితమైన, సమర్థవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఔషధమని అధికారులు తెలిపారు. పిల్లల వయసుకు అనుగుణంగా సరైన మోతాదులో శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయుల ద్వారా మాత్రలు అందిస్తారు. ఒకటి నుంచి ఐదేళ్ల వయసున్న నమోదు కాని పిల్లలు, 6 నుంచి 19 ఏళ్ల వయసున్న బడికి వెళ్లని బాలబాలికలకు మాత్రలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆశా కార్యకర్తలు ఇలాంటి పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటారు.

**సెప్టెంబరు 23 నాటికి మాత్రల పంపిణీ పూర్తి:** సిద్ధం చేసిన 1.24 కోట్ల ఆల్బెండజోల్ మాత్రలను సెప్టెంబరు 23 నాటికి సంబంధిత సంస్థలకు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లాలు, మండలాల వరకు వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబరు 25న మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు అక్టోబరు 5న నిర్వహించే మాప్-అప్ డేలో మాత్రలు అందేలా చర్యలు చేపడుతున్నారు.

**56 మంది అధికారులతో పర్యవేక్షణ:** కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు సెప్టెంబరు 24, 25 తేదీల్లో ఆరోగ్యశాఖకు చెందిన 56 మంది అధికారులు, సలహాదారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపడతారు. జిల్లా స్థాయిలో ఆరోగ్యం, విద్య, ఐసీడీఎస్, ఇతర సంబంధిత శాఖల అధికారులు కూడా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

**డిజిటల్ విధానంలో నివేదికలు:** కార్యక్రమంపై అవగాహన కల్పించడంతో పాటు వివరాల నమోదును పటిష్ఠం చేసేందుకు డిజిటల్ ఐఈసీ సామగ్రి, ఆన్‌లైన్ నివేదికలు, ఎన్‌డీడీ యాప్, ఏఎన్ఎం/ఎంఎల్‌హెచ్‌పీ యాప్‌లో ఎన్‌డీడీ విభాగం, గూగుల్ ఆధారిత కవరేజ్ నివేదికలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

## ఘనంగా ఎమ్‌టీఎక్స్ ఆస్ట్రా-26 హ్యాకథాన్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్‌టీఎక్స్ ఆస్ట్రా--26 హ్యాకథాన్ సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 1,200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు, సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక ప్రతిభను వెలికితీయడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్, ముఖ్య కార్యనిర్వహణ సంచాలకులు శరత్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం విద్యా పరిమితులకు మాత్రమే కాకుండా సమాజం, పరిశ్రమలకు ఉపయోగపడే ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనకు వినియోగించాలని సూచించారు. ఎమ్‌టీఎక్స్ సంస్థ హ్యాకథాన్ విజేతలకు రూ. 1 లక్ష నగదు బహుమతితో పాటు శిక్షణ, ఉద్యోగ శిక్షణ అవకాశాలు, ఆకర్షణీయమైన ఉద్యోగ ప్యాకేజీలు అందించనున్నట్లు తెలిపారు. ఎమ్‌టీఎక్స్ ఆస్ట్రా-26 హ్యాకథాన్‌ను మూడు దశల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన తొలి దశలో విద్యార్థులు న్యాయనిర్ణేతల ముందు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రాజెక్టుల సాంకేతిక నైపుణ్యం, వినూత్నత, సమస్య పరిష్కార విధానం, ఆచరణాత్మక అమలు సామర్థ్యాన్ని పరిశీలించిన న్యాయనిర్ణేతలు ప్రతిభ కనబరిచిన బృందాలను రెండో దశకు ఎంపిక చేశారు. రెండో దశను సెప్టెంబరు 26న నిర్వహించనున్నారు. ఇందులో ఎంపికైన బృందాలు తమ ప్రాజెక్టులను మరింత లోతుగా వివరిస్తూ సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలు, ఆచరణాత్మక అమలు సామర్థ్యాన్ని ప్రదర్శించనున్నారు. పరిశ్రమతో విద్యార్థులకు అనుసంధానం కల్పిస్తూ వారి ప్రతిభను ప్రదర్శించేందుకు ఎమ్‌టీఎక్స్ ఆస్ట్రా-26 గొప్ప వేదికగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## జూనియర్ డాక్టర్లకు స్టైపెండ్ పెంపు

- 01.01.2026 నుంచి పెరిగిన స్టైపెండ్ అమలు
- పీజీలకు 5 శాతం.. సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు 3.5 శాతం పెంపు
- ఏటా 3.5 శాతం చొప్పున పెంపునకు ప్రభుత్వం నిర్ణయం
- ప్రభుత్వంపై ఏడాదికి రూ.34.08 కోట్ల అదనపు భారం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, పీజీ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్టైపెండ్‌ను పెంచింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి వీరపాండ్యన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం, పీజీ వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు 3.5 శాతం మేర స్టైపెండ్‌ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పెంచిన స్టైపెండ్ 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హౌస్ సర్జన్లకు ఇప్పటివరకు నెలకు రూ. 25,906గా ఉన్న స్టైపెండ్ రూ. 28,497కు పెరగనుంది. పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ. 60,823 నుంచి రూ. 63,864కు, రెండో సంవత్సరం విద్యార్థులకు రూ. 61,528 నుంచి రూ. 64,604కు, మూడో సంవత్సరం విద్యార్థులకు రూ. 64,767 నుంచి రూ. 68,005కు పెరిగింది.

పీజీ డిప్లమా, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులకు కూడా ఇదే విధంగా పెంపు వర్తించనుంది. మొదటి సంవత్సరం స్టైపెండ్ రూ. 60,823 నుంచి రూ. 63,864కు, రెండో సంవత్సరం రూ. 61,528 నుంచి రూ. 64,604కు, మూడో సంవత్సరం రూ. 64,767 నుంచి రూ. 68,005కు పెంచారు.

సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు కూడా ప్రభుత్వం స్టైపెండ్ పెంచింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ. 80,500 నుంచి రూ. 84,525కు, రెండో సంవత్సరం వారికి రూ. 82,800 నుంచి రూ. 86,940కు, మూడో సంవత్సరం వారికి రూ. 85,100 నుంచి రూ. 89,355కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇకపై స్టైపెండ్‌లో ఏటా 3.5 శాతం చొప్పున పెంపు ఉండేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పెంపు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని వైద్య విద్య సంచాలకులను ఆదేశించింది. పెరిగిన స్టైపెండ్ కారణంగా ప్రభుత్వంపై ప్రస్తుతం ఉన్న వ్యయానికి అదనంగా ఏడాదికి సుమారు రూ. 34.08 కోట్ల ఆర్థిక భారం పడనుంది.

## రోడ్లు ఊడ్చిన ఐఆర్ఎస్ అధికారి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్ పరిసరాల్లో సోమవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ ఆదేశాల మేరకు జీఎస్టీ జాయింట్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి దేవ్ కుమార్ రజ్వాణి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా దేవ్ కుమార్ రజ్వాణి స్వయంగా రోడ్డుపై చెత్తను తొలగిస్తూ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. జీఎస్టీ భవన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో కలిసి తొలగించి, శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ నేతృత్వంలో తమ శాఖ స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో కూడా పారిశుధ్యంపై అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి. రామకృష్ణ రాజు యాదవ్, సూపరింటెండెంట్ ఆర్.పీ.పీ. కుమార్, ఇన్‌స్పెక్టర్లు శరత్, రోహిత్, పి. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయులను రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

- శాప్ కార్యాలయం వద్ద ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఉద్యోగుల గౌరవానికి భంగం కలిగించే చర్యలను సహించరాదు
- ఉపాధ్యాయులపై దాడులకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రామకృష్ణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రామకృష్ణ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను రాజకీయ వివాదాల్లోకి లాగడం, వాస్తవాలను నిర్ధారించకుండానే వారిపై ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో రామకృష్ణ మాట్లాడుతూ బాధ్యత కలిగిన ఉద్యోగ సంఘంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాలపై జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. ఇంతకాలం జరిగిన పరిణామాలను రాజకీయ అంశాలుగా భావించి ఉద్యోగ సంఘం తరఫున తాము జోక్యం చేసుకోలేదన్నారు. అయితే తమపై బురదజల్లవద్దని, తమ గౌరవానికి భంగం కలిగించవద్దని ఉపాధ్యాయులే సమావేశాలు, నిరసనలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే బాధ్యతాయుతమైన వర్గమని, వారిని రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందని రామకృష్ణ పేర్కొన్నారు. ఏదైనా ఆరోపణ ఉంటే సంబంధిత వాస్తవాలను, ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే స్పందించాలని సూచించారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, రాజకీయ పార్టీలపై ఉందన్నారు.

ఉద్యోగులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు చేయకూడదని కోరారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, ఉపాధ్యాయులపై దాడులకు ప్రయత్నించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో తమ విధులు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రామకృష్ణ కోరారు.


## ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు ఎస్పీ వకుల్ జిందాల్ అభినందనలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ శాఖలో ఇటీవల హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన నలుగురు సిబ్బంది సోమవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 16వ తేదీన హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన కలింత సతీష్ బాబు, కానుకుర్తి రాధాకృష్ణ, మారసు రామకోటేశ్వరరావు, మాచ కళ్యాణ్ జిల్లా ఎస్పీని కలిసి పూలకుండీని అందజేసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ నూతనంగా పదోన్నతి పొందిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొందడం వారి సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తూ, రానున్న రోజుల్లో మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన సిబ్బంది తమ అనుభవాన్ని ఉపయోగించుకుని విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు.

## వివిఐటీ విశ్వవిద్యాలయంలో 'నెక్స్ట్ జనరేషన్ అగ్రికల్చర్'పై జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేసి పంట దిగుబడిని పెంచడం, వనరుల వృథాను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే లక్ష్యంతో వివిఐటీ విశ్వవిద్యాలయంలో 'నెక్స్ట్ జనరేషన్ అగ్రికల్చర్'పై ఐదు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో వివిఐటీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటున్నారు. ఈ విషయాలను వివిఐటీ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.

వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి హైదరాబాద్‌లోని ఇస్రో అగ్రికల్చర్ సైన్స్ అప్లికేషన్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ వి.ఎం. చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెక్స్ట్ జనరేషన్ అగ్రికల్చర్ విధానాలతో ఖచ్చితత్వ వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఐఓటీ సెన్సార్ల ద్వారా పొలాల్లోని తేమ, పోషకాల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించి రైతుల మొబైల్ ఫోన్లకు సమాచారం అందించవచ్చన్నారు. స్మార్ట్ మోటార్ల సహాయంతో పంటకు అవసరమైన సమయంలో, అవసరమైన పరిమాణంలో నీటిని అందిస్తూ బిందు సేద్యాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని వివరించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో వాతావరణ మార్పులను ముందుగానే అంచనా వేసి విత్తనాలు నాటడం, ఎరువులు వినియోగించడం వంటి వ్యవసాయ కార్యకలాపాలకు అనువైన సమయాన్ని నిర్ణయించుకోవచ్చని డాక్టర్ చౌదరి పేర్కొన్నారు. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి రైతులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని, తద్వారా మార్కెటింగ్‌లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో వివిఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున్ రెడ్డి, అకాడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వై. భానుమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ ఇనావుల్ హక్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ మహబూబ్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక ప్రగతిని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోంది

- రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకు
- 2024 ప్రజా తీర్పును పునరావృతం చేస్తాం
- ప్రతి పంచాయతీ, మున్సిపాలిటీలో బీజేపీ భాగస్వామ్యం
- కార్యకర్తలకు ప్రాధాన్యం.. ఎన్నికల్లో సీట్లు ఇచ్చి గౌరవిస్తాం
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్




**రాజమండ్రి,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. సోమవారం రాజమండ్రిలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పురందేశ్వరి, పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు వీధి నాటకాలు, వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకు సాగుతుందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. పార్లమెంటు స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పును పునరావృతం చేసే దిశగా పనిచేస్తామని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయంతో స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో ట్రిబుల్ ఇంజిన్ గ్రోత్ సాధించే దిశగా ముందుకు వెళ్తామని మాధవ్ అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించి సీట్లు ఇచ్చి గౌరవిస్తామని చెప్పారు. ప్రతి పంచాయతీలో, ప్రతి మున్సిపాలిటీలో బీజేపీ భాగస్వామ్యం ఉండేలా పార్టీని విస్తరిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నామినేషన్ పత్రాలు చించివేయడం, అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి దాడులు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించిన ఆయన, ఈసారి అలాంటి పరిస్థితులకు అవకాశం ఉండదన్నారు.

తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యి నాణ్యతపై మాధవ్ పలు ఆరోపణలు చేశారు. వైసీపీ ఈ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తులో కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సిట్ చార్జిషీట్‌లో కల్తీ నెయ్యి వినియోగానికి సంబంధించిన అంశాలు నమోదైనట్లు టీటీడీ కూడా వెల్లడించింది. లడ్డూ పవిత్రత కోసం బీజేపీ రాజీలేని పోరాటం చేస్తోందని మాధవ్ అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున మద్యం అక్రమాలు జరిగాయని మాధవ్ ఆరోపించారు. దర్యాప్తులు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్షంపై రాజకీయంగా విమర్శలు చేస్తూ ప్రజల ముందు వాస్తవాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

యూపీఐ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను మాధవ్ ప్రస్తావించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విస్తరిస్తోందని తెలిపారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో భారత్ పలు అంశాలపై చర్చలు జరిపిందని మాధవ్ తెలిపారు. బ్రిక్స్ వేదికగా ఆర్థిక, రాజకీయ, భద్రత, సాంకేతిక రంగాల్లో సహకారంపై చర్చలు జరిగాయని పేర్కొన్నారు. భారత్ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వాస్తవ జీడీపీ వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక ప్రగతిని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోందని మాధవ్ విమర్శించారు. పంచదార మిల్లుల్లో ఉత్పత్తి వ్యయం పెరగడంతో చక్కెర ధరలు పెరిగాయని మాధవ్ తెలిపారు. మహారాష్ట్రలోనూ ధరలు అధికంగా ఉన్నాయని, ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉల్లి దిగుబడి తగ్గడం వల్ల ధరలు పెరిగాయని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవాల్‌గా మారుతున్నాయని తెలిపారు.

అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీ ముందుకు సాగుతుందని మాధవ్ అన్నారు. ప్రతి పంచాయతీ, మున్సిపాలిటీలో పార్టీ భాగస్వామ్యం ఉండేలా క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను విస్తరిస్తామని తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467